ఈనాడు
ఎన్ఆర్ఐ

# తానా-ఎస్పీఎంవీవీ సంయుక్తంగా సంగీతం కోర్సు




డల్లాస్: తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, అమెరికాలోని తానా సంయుక్తంగా సంగీత కోర్సులు ప్రారంభించాయి. ఈ సంగీత కోర్సుల్లో దాదాపు వంద మంది విద్యార్థులు చేరారని తానా అధ్యక్షుడు డాక్టర్ జంపాల చౌదరి తెలిపారు. తానా ఆధ్వర్యంలో ఇటువంటి కోర్సులు ప్రారంభించటం ఇదే మొదటిసారని ఆయన అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను పెంపొందించేందుకు ఇది ఎంతో దోహదపడుతోందని చెప్పారు. తానా ఆధ్వర్యంలో ఇంతటి మంచి కార్యక్రమం చేపట్టేందుకు కృషి చేసిన తానా పూర్వ అధ్యక్షులు ప్రసాద్ తోటకూరకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

విశ్వవిద్యాలయం రూపొందించిన సంగీత పాఠ్య ప్రణాళికను ఉత్తర అమెరికాలోని విద్యార్థులు పాటిస్తే, అమెరికాలోనే పరీక్షలు రాసి నాలుగు స్థాయిలు పూర్తి చేసిన తర్వాత యూనివర్శిటీ డిప్లొమా సర్టిఫికేట్‌ను పొందవచ్చని డాక్టర్ ప్రసాద్ తోటకూర చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ దుర్గాభవానీ, డీన్ ప్రొఫెసర్ శారద, వారి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. సంగీతంపై ఆసక్తి ఉన్న ఎన్నారైలకు ఇది మంచి అవకాశమని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు వెంటనే ఈ కోర్సుల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తానా సంగీత కోర్సులకు జాతీయ సమన్వయకర్తగా ఉండటానికి అంగీకరించిన మీనాక్షి అనిపిండికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తానా నేషనల్ మ్యూజిక్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న మీనాక్షి అనిపిండి మాట్లాడుతూ.. తానా ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ సంగీత కోర్సుల్లో పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా ఎన్నారై విద్యార్థులు భారతదేశంలోనే కాకుండా ఇక్కడే పరీక్షలు రాసి డిప్లొమా పొందవచ్చని చెప్పారు. ఇది మంచి అవకాశమని ఆసక్తి ఉన్న వారు ఇందులో వెంటనే పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. అంతే కాకుండా పిల్లలు ఈ కోర్సులో చేరేందుకు తల్లిదండ్రులు, సంగీత గురువులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఉత్తర అమెరికాలో నివసిస్తున్న ఆసక్తి గల విద్యార్థులు మార్చి 20 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తానా ప్రాంతీయ ప్రతినిధి శ్రీకాంత్ పోలవరపు, సంయుక్త కోశాధికారి డాక్టర్ రాజేశ్ అడుసుమిల్లి తదితరులు పాల్గొన్నారు.